బీజేపీతోనే దేశ అభివృద్ధి


మిఠాయిలు పంచుతున్న కవాడిగూడ డివిజన్ కార్పొరేటర్ రచనశ్రీ

కవాడిగూడ: బీజేపీ పాలనలోనే దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని కవాడిగూడ కార్పొరేటర్ జి. రచనశ్రీ అన్నారు. సికింద్రాబాద్‌లో పాటు దేశ వ్యాప్తంగా బీజేపీ ఎంపీ అభ్యర్థులు అత్యధిక స్థానాల్లో గెలుపొందినందుకు కవాడిగూడ బీజేపీ ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ..... దేశవ్యాప్తంగా మోదీ నాయకత్వాన్ని బలపర్చిన ఓటర్లందరికి కృతజ్ఞతలు తెలిపారు. మోదీ నాయకత్వంలోనే దేశం మరింత బలోపేతం అవుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ టి. రవిందర్, బీజేపీ రాష్ట్ర నాయకులు జి. వెంకటేష్, పరిమళ్‌కుమార్, బీజేపీ ఓబీసీ మోర్చా నగర అధ్యక్షులు సలంద్రి శ్రీనివాస్ యాదవ్, కవాడిగూడ డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు ఎం.సి మహేందర్‌బాబు, ఏ. ప్రభాకర్ గంగపుత్ర, నాయకులు బి.ఎం శ్రీనివాస్ పాల్గొన్నారు.

గానసభ నిర్వాహకుల సేవలు అభినందనీయం


సంగీత గురువులు మంజుల, సంయుక్తలను సన్మానించిన ఎమ్మెల్సీ ఎస్.మధుసూదనాచారి, జనార్ధనమూర్తి

చిక్కడపల్లి: ఐదున్నర దశాబ్దాలకు పైగా పలు సాంస్కృతిక కార్యక్రమాలకు వేదిక కల్పిస్తూ త్యాగరాయ గానసభ నిర్వాహకులు కళాకారులను ప్రోత్సహించడం అభినందనీయమని ఎమ్మెల్సీ ఎస్.మధుసూదనాచారి అన్నారు. మంగళవారం త్యాగరాయగాన సభ 58వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ త్యాగరాయ గానసభ శాస్త్రీయ కళలకు ప్రాధాన్యత నిస్తుందన్నారు. గానసభ అధ్యక్షులు కళా జనార్ధనమూర్తి మాట్లాడుతూ 58 ఏళ్లుగా గానసబలో ఎందరో సంగీత, నత్య, నాటక కళాకారులు ప్రదర్శనలిచ్చారన్నారు. తొలుత సంగీత గురువు సంయుక్త శిష్యబందం, రాగరమ్య ఫైన్ ఆర్ట్స్ మంజుల శిష్యబందం శాస్త్రీయ గానగోష్టి నిర్వహించారు. ఈ సందర్భంగా సంగీత గురువులు మంజుల, సంయుక్తలను సన్మానించారు.

ఈటల విజయంపై సంబరాలు



రసూల్‌పురా: మల్కాజిగిరి పార్లమెంట్ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ భారీ మెజార్టీతో ఘన విజయం సాధించడంతో కంటోన్మెంట్‌లో బీజేపీ శ్రేణులు, ఈటల అభిమానులు విజయోత్సవ సంబురాలు జరుపుకున్నారు. తాడ్‌బండ్‌లో బోర్డు మాజీ ఉపాధ్యక్షులు సదా కేశవరెడ్డి ఆధ్వర్యంలో బాణసంచా కాల్చి మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా సదా కేశవరెడ్డి కేక్ కట్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బీజేపీ మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థిగా ఈటల రాజేందర్‌ను అధిష్టానం ప్రకటించిన రోజే ఆయన గెలుపు ఖాయమైందన్నారు. మల్కాజిగిరి పార్లమెంట్ నుంచి భారీ మెజార్టీతో గెలుపొందిన ఈటలకు కేంద్ర మంత్రి పదవి దక్కే అవకాశం ఉంటుందన్నారు. సామల సత్తిరెడ్డి, మాచర్ల శ్రీనివాస్, వెంకటాచారి, మహేష్, నాగరాజు, చిన్నం పాండు పాలొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కాచిగూడ: మున్నూరుకాపు విద్యార్థి వసతి గృహం ట్రస్ట్‌బోర్డు ఆధ్వర్యంలో కాచిగూడలో నిర్వహిస్తున్న మున్నూరుకాపు హాస్టల్‌లో 2024–25 విద్యా సంవత్సరానికి రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాలకు చెందిన విద్యార్థులకు హాస్టల్ వసతి కల్పిస్తున్నట్లు ట్రస్ట్ బోర్డు చైర్మన్ ప్రొఫెసర్ ఎం.ఆర్.వెంకట్‌రావు తెలిపారు. అసక్తిగల అభ్యర్థులు ఈ నెల 7 వ తేదీ నుంచి 29లోగా కాచిగూడలోని ట్రస్ట్‌బోర్డు కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అర్హులైన విద్యార్థులకు తగిన సహాయం అందించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. వివరాలకు సెల్: 040–24658160, 9491627404 సంప్రదించాలన్నారు.

ప్రతి రౌండ్‌లోనూ అదే జోరు

- ముషీరాబాద్ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డికి 27,681 ఓట్ల మెజారిటీ
- మొదటి స్థానంలో బీజేపీ రెండో స్థానంలో కాంగ్రెస్


ఏవీ కళాశాలలోని ఓట్ల లెక్కింపు జరుగుతున్న దృశ్యం

కవాడిగూడ: సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి పోటీ చేసిన బీజేపీ అభ్యర్థి జి. కిషన్‌రెడ్డికి 27,681 ఓట్ల మెజార్టీ లభించింది. మంగళవారం దోమలగూడలోని ఏవీ కళాశాలలో జరిగిన ఎన్నికల కౌంటింగ్‌లో నియోజకవర్గం ఏఆర్‌ఓ లక్ష్మి నారాయణ ప్రకటించిన వివరాల ప్రకారం ముషీరాబాద్‌లో మొత్తం ఓటర్లు 3,07,556 మంది ఓటర్లు ఉండగా ఇందులో 1,51,193 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. వీరితోపాటు 1462మంది ఓటర్లు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఏవీ కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రంలో14 టేబుళ్లపై 20 రౌండ్స్‌తో ఓట్లను లెక్కించారు. బీజేపీ అభ్యర్థి జి. కిషన్‌రెడ్డికి 20 రౌండ్‌లలో 77,116 ఓట్లు పడ్డాయి. కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్‌కు 49,435 ఓట్లు రాగా, బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి టి. పద్మారావు గౌడ్‌కు 21,3333 ఓట్లు మాత్రమే లభించాయి. పోలైన ఓట్లను బట్టి బీజేపీ అభ్యర్థికి ప్రథమ స్థానంలో కాంగ్రెస్ అభ్యర్థి ద్వితీయ స్థానంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి మూడవ స్థానంలో నిలిచారు.

ఆధిక్యతను ప్రదర్శించిన బీజేపీ..

ముషీరాబాద్ నియోజకవర్గం ఓట్ల లెక్కింపులో 4 రౌండ్‌లు మినహా 16 రౌండ్‌లలో బీజేపీ అధిక్యతను ప్రదర్శించింది. కాంగ్రెస్ పార్టీ 4 రౌండ్‌లలో ఆధిక్యతను చాటింది. బీఆర్‌ఎస్ పార్టీ మాత్రం 20 రౌండ్‌లలో మూడవ స్థానానికే పరిమితమైంది. బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డి 27,681 ఓట్ల ఆధిక్యతను సాధించారు. గత పార్లమెంటు ఎన్నికల్లోనూ కిషన్‌రెడ్డి ముషీరాబాద్ నుంచి 24,500 మెజార్టీని సాధించారు. ఎన్నికల కౌంటింగ్ సదర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా దోమలగూడ ఇన్‌స్పెక్టర్ దొంతిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

అండగా నిలిచిన అంబర్‌పేట

కిషన్‌రెడ్డికి 41,655 ఓట్ల మెజార్టీ



అంబర్‌పేటలో మొత్తం ఓట్లు		
పోలైన ఓట్లు	--	1.44584
బీజేపీ	--	83.048
కాంగ్రెస్	--	41.393
బీఆర్ఎస్	--	17.183

అంబర్‌పేట: సికింద్రాబాద్ పార్లమెంట్‌అభ్యర్థి జి. కిషన్‌రెడ్డికి అంబర్‌పేట ప్రజలు ఎప్పటిలాగే అండగా నిలిచారు. ఎన్నికలు ఏవైనా కిషన్‌రెడ్డికి అంబర్‌పేట ప్రజలు భారీ మెజార్టీ ఇచ్చి అక్కున చేర్చుకుంటున్నారు. తాజా పార్లమెంటు ఎన్నికల్లో సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గంలో భాగమైన అంబర్‌పేట అసెంబ్లీ నుంచి కిషన్‌రెడ్డికి భారీ మెజార్టీ దక్కింది. 2019లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో సహితం అంబర్‌పేట నియోజకవర్గం ప్రజలు ఇచ్చిన మెజార్టే ఆయన గెలుపులో కీలకమైంది. మంగళవారం జరిగిన ఓట్ల లెక్కింపులో అంబర్‌పేట నియోజకవర్గం నుంచే ఆయనకు అత్యధిక మెజార్టీ వచ్చింది. 2019 ఎన్నికల్లో అంబర్‌పేట నుంచి 48,410 ఓట్ల మెజార్టీ రాగా ప్రస్తుత ఎన్నికల్లో 41,655 ఓట్ల మెజార్టీ వచ్చింది.

ప్రతి రౌండ్‌లో బీజేపీ అధిక్యం...

అంబర్‌పేట అసెంబ్లీ నియోజకవర్గం ఓట్ల లెక్కింపు ప్రక్రియను 14 రౌండ్లలో చేపట్టారు. ఉదయం 8 గంటలకు ప్రారంభమైన ఓట్ల లెక్కింపు ప్రక్రియ మధ్యాహ్నం 2 గంటలకు ముగిసింది. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికార యంత్రంగం ఓట్ల లెక్కింపు ప్రక్రియను నిర్వహించింది. అసెంబ్లీ ఓట్ల లెక్కింపులో ప్రధానంగా బీజేపీ, కాంగ్రెస్, బీఆర్‌ఎస్ ప్రధానంగా పోటీ పడ్డాయి. బ్యాలెట్ ఓట్లు నుంచి చివరి వరకు ప్రతి రౌండ్‌లో బీజేపీ అధిక్యతను ప్రదర్శించింది.

అధిక ఫీజులపై పోరాడతాం


ఆషాడపు మధు

ఉస్మానియా యూనివర్సిటీ: అధిక ఫీజులు, విద్యార్థి సంక్షేమం, విద్యారంగ సమస్యలపై పోరాడనున్నట్లు తెలంగాణ విద్యార్థి ఫోరం (టీవీఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు ఆషాడపు మధు పేర్కొన్నారు. మంగళవారం ఓయూలో జరిగిన ముఖ్యకార్యకర్తల సమావేశం అనంతరం టీవీఎఫ్ నూతన అధ్యక్షుడిగా మధును రాష్ట్ర కార్యవర్గం ఎన్నుకుంది. ఉమ్మడి వరంగల్ జిల్లా (ప్రస్తుతం భూపాలపల్లి) గణపురం మండలం సీతారాంపురం గ్రామానికి చెందిన మధు తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారు. విద్యారంగాన్ని పట్టిపీడిస్తున్న అధిక ఫీజులపై పోరాడనున్నట్లు ఈ సందర్భంగా మధు పేర్కొన్నారు.


స్వీట్లు పంచి సంబరాలు చేసుకుంటున్న కార్పొరేటర్ పావనీ వినయ్‌కుమార్ తదితరులు

ప్రత్యేక పూజలు

చిక్కడపల్లి: లోకసభ ఎన్నికల్లో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ అభ్యర్థి జి.కిషన్‌రెడ్డి విజయం సాధించినందుకు ఆ పార్టీ నేతలు మంగళవారం సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేసి స్వీట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ పావనీ వినయ్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో 8 ఎంపీ స్థానాలను బీజేపీ కైవసం చేసుకోవడం, సికింద్రాబాద్ పార్లమెంట్ అభ్యర్థిగా జి.కిషన్‌రెడ్డి ఘన విజయం సాధించడం శుభపరిణామన్నారు. ప్రధాని నరేంద్ర హ్యాట్రిక్ సాధించి రికార్డు సృష్టించారన్నారు. ఓట్లు వేసి గెలిపించిన ప్రజలందరికి, ఎంపీ కిషన్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. డివిజన్ అధ్యక్షుడు రత్నసాయిచంద్, నేతలు గోపాల్, వీఎస్టీ రాజు, శ్రీకాంత్, ఉమేష్, నర్సింగరావు, చామర్తి వాణీశ్వరశాస్త్రి, దోనేటి సత్యం, వంజరి శ్రీనివాస్, నవీన్, శ్రీనివాస్‌రావు, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.


అంబర్‌పేటలో సంబరాలు చేసుకుంటున్న బీజేపీ శ్రేణులు


సంబురాలు జరుపుకుంటున్న నల్లకుంట బీజేపీ నేతలు


విజయోత్సవ వేడుకల్లో పార్టీ నేతలు డాక్టర్ ఎన్.గౌతంరావు తదితరులు


కిషన్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలియజేస్తున్న ఎడెల్లి అజయ్‌కుమార్

కమల వికాసం..

- కాషాయ శ్రేణుల్లో జోష్
- వాడవాడలా సంబురాలు

అంబర్‌పేట, ముషీరాబాద్ నియోజకవర్గాల్లో బీజేపీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. మంగళవారం వెలువడిన ఫలితాల్లో బీజేపీ అభ్యర్థి కిషన్ రెడ్డి ఘన విజయం సాధించడంతో ఆ పార్టీ నేతలు మిఠాయిలు పంచుకుని సందడి చేశారు. బాణాసంచా కాల్చి ఆనందం వ్యక్తం చేశారు. వేడుకల్లో పలువురు కార్పొరేటర్లు, నియోజవర్గ బాధ్యులు, పార్టీ నేతలు పాల్గొన్నారు.

– అంబర్‌పేట, ముషీరాబాద్




నారాయణగూడలో..


బాగ్‌లింగంపల్లిలో ఆటో కార్మికుడికి స్వీట్లు ఇస్తున్న రాంనగర్ డివిజన్ కార్పొరేటర్ కె.రవిచారి


స్వీట్స్ పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్


రాంనగర్ గుండు వద్ద ..


రాంనగర్ డివిజన్‌లో..


హరినగర్‌లో విజయోత్సవ ర్యాలీ..

ఈటల రాజేందర్‌కు సత్కారం


ఈటల రాజేందర్‌ను అభినందిస్తున్న వెంకటేశ్వర్ ముదిరాజ్

కాచిగూడ: లోక్‌సభ ఎన్నికల్లో మల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా భారీ మెజార్టీతో గెలుపొందిన ఈటల రాజేందర్‌ను మంగళవారం అఖిల భారత ముదిరాజ్ సంఘం జాతీయ అధ్యక్షుడు పొట్లకాయల వెంకటేశ్వర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ముదిరాజ్ సంఘం ప్రతినిధులు ఘనంగా సత్కరించి అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి ఈ. శ్రీనివాస్ రాజ్, ప్రేమ్ విమల్ ముదిరాజ్, పృధ్వీరాజ్, నీరజ, నాగరాజ్, వీణ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

మత విద్వేశాలకు చెంపపెట్టు

ముషీరాబాద్: బుల్డోజర్ న్యాయానికి, మత విద్వేశాలకు పార్లమెంట్ ఎన్నికల ఫలితాలు చెంపపెట్టని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా నాయకులు అన్నారు. నిరుద్యోగం, అవినీతి, కార్పొరేట్ అనుకూల విధానాలు, నిరంతృత్వ పాసిస్టు విధానాలపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకత ఈ ఎన్నికల ఫలితాలలో కనిపించిందని పార్టీ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు పేర్కొన్నారు. ఎన్నికల కమిషన్‌తో సహా రాజ్యాంగ అన్ని వ్యవస్థలను దుర్వినియోగం చేయడమేగాక కార్పొరేట్ మీడియాను మేనేజ్ చేసి సోషల్ మీడియాతో పెద్ద ఎత్తున ప్రచారం చేసినా బీజేపీకి ప్రయోజనం చేకూరలేదన్నారు. ప్రతి పక్షాల మధ్య పూర్తిస్థాయిలో ఐక్యత లేకపోవడం ప్రతిపక్షాల నేతలను జైళ్లల్లో బందించడం తదితర కారణాలతో బీజేపీ కొంత లబ్ధి పొందిందన్నారు.

రోబోటిక్ ఓపెన్ హార్ట్ సర్జరీతో మంచి ఫలితాలు

పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ గోపాలకృష్ణ గోఖలే



చిక్కడపల్లి: ప్రతి ఒక్కరూ గుండె సంబంధిత వ్యాధుల పట్ల అవగాహన కలిగి ఉండాలని ప్రముఖ హార్ట్ ట్రాన్స్ ప్లాంట్ సర్జన్, పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ గోపాలకృష్ణ గోఖలే అన్నారు. మంగళవారం సాయంత్రం చిక్కడపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఓపెన్ హార్ట్ సర్జరీలో అనేక మార్పులు వచ్చాయని , రోగులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా రోబోటిక్ ఓపెన్ హార్ట్ సర్జరీ చేస్తున్నట్లు తెలిపారు. తద్వారా రోగికి రక్తం వృథా కాదని, ఎలాంటి ఇన్ఫెక్షన్లు రావని తెలిపారు.

బీఆర్‌ఎస్ మహిళా నేతను పరామర్శించిన ఎమ్మెల్యే



రామంతాపూర్: లక్ష్మీనారాయణ కాలనీకి చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు లతారెడ్డి అనారోగ్యంతో మలక్‌పేట్ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి మంగళవారం ఆమెను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి పిల్లల చదువుల విషయంతో పాటు ఆర్థికంగా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. స్థానిక బీఆర్‌ఎస్ నేతలు పాయసం గోపాల్, అలెగ్జాండర్ సీహెచ్ రాములు, పద్మ తదితరులు పాల్గొన్నారు.

చిక్సిత పొందుతున్న యువకుడి మృతి

కుషాయిగూడ: రోడ్డు ప్రమాదంలో గాయపడి చిక్సిత పొందుతున్న ఓ యువకుడు మృతి చెందాడు. చర్లపల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సాయినగర్ కాలనీకి చెందిన కాటెపల్లి పవన్ కుమార్‌రెడ్డి కుమారుడు వివేకానందరెడ్డి(16) విద్యార్థి. కుషాయిగూడకు చెందిన స్నేహితులు రిత్విక్, శివతో కలిసి బైక్‌పై చక్రిపురం నుంచి చిన్న చర్లపల్లికి వెళ్తున్నారు అతివేగం కారణంగా మోడీ అపార్ట్‌మెంట్స్ వద్ద ద్విచక్ర వాహనం స్కిడ్ కావడంతో రోడ్డుపై పడిపోయారు. దీంతో వివేకానందరెడ్డి ఎడమ కాలు, తొడ, వెన్నెముకకు తీవ్ర గాయాలయ్యాయి. ఈసీఐఎల్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మహేష్ భగవత్‌కు అభినందనలు


మహేష్ భగవత్‌కు అభినందనలు తెలుపుతున్న సుంకర నరేష్ తదితరులు

కుషాయిగూడ: తెలంగాణలో అత్యుత్తమ సేవలు అందించిన పోలీసు ఉన్నతాధికారి మహేష్ మురళీధర్ భగవత్‌కు గతంలో కేంద్ర రాష్ట్రపతి పోలీస్ మెడల్ ప్రకటించిన విషయం విధితమే. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మహేష్ మురళీధర్ భగవత్ సదరు మెడల్‌ను సీఎం రేవంత్‌రెడ్డి చేతులమీదుగా అందుకున్నారు. రాష్ట్ర డీజీపీ కార్యాలయంలో మంగళవారం ప్రముఖ న్యాయవాది సుంకర నరేష్, ప్రముఖ వ్యాపారవేత్త డాక్టర్ అనిల్‌కుమార్, మేకల నవీన్ నాయుడు కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

కుషాయిగూడ: జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో రూపొందించిన లోక్ అదాలత్ వాల్ పోస్టర్‌ను మంగళవారం మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా జడ్జి వి.బాలభాస్కర్‌రావు, సివిల్ జడ్జి డి.కిరణ్ కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జడ్జి బాలభాస్కర్‌రావు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా పరిష్కారానికి నోచుకొని సమస్యలను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవచ్చన్నారు. అన్ని పోలీస్ స్టేషన్లలో లోక్ అదాలత్ పోస్టర్‌ను ప్రదర్శించి, ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకొనేలా అవగాహన కల్పించాలని సుచించారు. కార్యక్రమంలో నర్సింహారెడ్డి, డెవిడ్ రాజు ఉన్నారు.

పోస్టల్ బ్యాలెట్ ఓట్లలో కిషన్‌రెడ్డికి 1853 ఓట్ల లీడ్

బంజారాహిల్స్: సికింద్రాబాద్ పార్లమెంట్‌కు సంబంధించి పోస్టల్ బ్యాలెట్, సర్వీసు ఓటింగ్, హోం ఓటింగ్ ఓట్ల లెక్కింపు ఓయూలోని ప్రొఫెసర్ జి.రాంరెడ్డి దూర విద్యా కేంద్రంలో జరిగింది. బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డికి 4,701 ఓట్లు, కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్‌కు 2,848 ఓట్లు, బీఆర్‌ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్‌కు 906 ఓట్లు, బీఎస్పీ అభ్యర్థి 20 ఓట్లు పోలయ్యాయి. నోటాకు 74 ఓట్లు పోలయ్యాయి. మొత్తం 8,898 ఓట్లకు గాను 219 ఓట్లు ఇన్‌వాలీడ్ కాగా, 61 ఓట్లు తిరస్కరణకు గురయ్యాయి. పోస్టల్ బ్యాలెట్లలో కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్‌పై బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డి 1,853 ఓట్ల లీడ్ సాధించారు.